పాలమూరులో క్రీడా సంబురం

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ

పాల్గొననున్న 10 జిల్లాలు, 360 మంది క్రీడాకారులు

ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

5

కొలువును వదిలి.. వెంకన్న సేవకు కదిలి

ఆధ్యాత్మిక సేవలో సందడి రంగారెడ్డి

సివిల్ ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా

జీవితాంతం వట్టెం వేంకటేశ్వర స్వామి సేవ

4



చాంపియన్ మహబూబ్‌నగర్

అండర్ 23 క్రికెట్ పోటీల్లో ఘన విజయం

రన్నర్‌గా నిలిచిన నాగర్‌కర్నూల్

సెంచరీతో రాణించిన అక్షయ్

ఆల్ రౌండర్‌గా నిలిచిన అబ్దుల్ రాఫె

5



కురుమూర్తి స్వామికి పట్టు వస్త్రాల తయారీ ప్రారంభం

వచ్చే నెల 6 నాటికి పూర్తి

పూజకు హాజరైన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి

5



పేదోళ్ల ఆపిల్ సీతాఫలాలు అటు కూలీలు, రైతులు, ఇటు మహిళా సంఘాలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ ఫలాలు విరివిగా లభించే మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంచి ఫలితాలను ఇస్తోంది. కూలీలు, రైతుల నుంచి సీతా ఫలాలను నాణ్యతను బట్టి కిలోకు రూ.10 నుంచి రూ.15కు కేంద్రం నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన ఫలాలను ప్రాసెసింగ్ యూనిట్‌లో రెండు రోజులు మాగపెట్టి, గుజ్జును వేరు చేస్తున్నారు. అనంతరం ఆ గుజ్జును కిలో చొప్పున ప్యాకింగ్ చేసి, ఐస్‌క్రీం కంపెనీలకు రూ.180 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. ఈ యూనిట్‌లో రోజూ 40 మంది పని చేస్తుండగా, ఒక్కొక్కరికి రూ.400 చొప్పున కూలీ చెల్లిస్తున్నారు. సీతాఫలాలు లభించే ఈరెండు నెలల్లోనే గుజ్జు విక్రయం ద్వారా రూ.ఐదు లక్షల వ్యాపారం చేస్తున్నారు.

- నవాబ్‌పేట



సీతాఫలాల నుంచి గుజ్జును వేరు చేస్తున్న మహిళలు

ఉపాధి ఫలాలు



- సత్ఫలితాలిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్
- నవాబ్‌పేట మండలంలో విరివిగా పండ్లు లభ్యం
- రైతుల నుంచి సేకరణ
- కిలోకు రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు
- వాటి నుంచి గుజ్జు వేరు చేసి ఐస్‌క్రీం కంపెనీలకు విక్రయం
- రెండు నెలల్లోనే రూ.ఐదు లక్షల వ్యాపారం



5

న్యూస్ బాక్స్

దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఐటీఐ బాలికల కళాశాల అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నవంబరు 25 నుంచి ప్రారంభం కానున్న ఆరు కొత్త కోర్సులలో అడ్మిషన్ కోసం ఈ నెల 30 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 172 సీట్లు ఉన్నాయని, వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే విద్యార్హత, వయస్సు, ఆధార్ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30 వరకు ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదువుకున్న నిరుద్యోగ విద్యార్థినులు, మహిళలకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏడాది వ్యవధి కలిగిన మాన్యుఫ్యాక్షరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రొబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్షరింగ్, ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, రెడేళ్ల వ్యవధి గల బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్ సీఎస్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ప్రింటెండ్ కాపితో పాటు అన్ని ఒర్జినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఈ నెల 30లోపు బాలికల ఐటీఐ కేంద్రంలో వాక్‌ఇన్ అడ్మిషన్‌కు హాజరు కావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒకే ఒక్కడు

- మహబూబ్‌నగర్ జిల్లాలో 135 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- సక్రమంగా సాగని విద్యా బోధన
- పిల్లలను ప్రైవేటు బడులకు పంపుతున్న తల్లిదండ్రులు
- విద్యార్థులు లేరని 48 పాఠశాలల మూత

7



మూతపడిన మహ్మదాబాద్ మండలం బోరింగ్ తండా పాఠశాల

విద్యుదాఘాతంతో మత్స్య కార్మికుడి మృతి

- వనపర్తి జిల్లాలో ఘటన

పెద్దమందడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొలంలో పంట రక్షణకు వేసిన విద్యుత్ కంచెకు తగిలి ఓ మత్స్యకార్మికుడు మృతి చెందారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూరు గ్రామ శివారులో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిగట్ల గ్రామానికి చెందిన మన్నెంకొండ (64) వెల్టూరు గ్రామ శివారులోని రైతు వడ్డె బాలయ్యకు చెందిన పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. పక్కనే ఉన్న బుగ్గ చెరువులో మత్స్య సహకార సంఘం తరఫున చేపలు పెంచుతున్నారు. మత్స్యకారుల్లో రోజూ ఒకరు చెరువుకు కాపలా కాయాల్సి ఉంటుంది. అందుకోసం శనివారం రాత్రి తొమ్మిది గంటలకు మన్నెంకొండ చెరువు దగ్గరకు బయలుదేరాడు. తాను కౌలుకు తీసుకున్న పొలం మీదుగా వెళ్తుండగా, విద్యుత్ కంచెకు తగిలి కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ మన్నెంకొండ మృతదేహం కనిపించింది. దీంతో అతడి కుమారుడు సురేశ్ గ్రామస్థులకు విషయం చెప్పడంతో మాజీ సర్పంచు పుట్టమోని నారాయణ, సంఘం సభ్యులు మత్స్యశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

- పీయూకు ఇంజనీరింగ్, లా కళాశాలలను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ / జడ్చర్ల / పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాలమూరు విశ్వవిద్యాలయానికి లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జిల్లా ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మహబూబ్‌నగర్, జడ్చర్ల ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సీఎంను కలిశారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి లా, ఇంజనీరింగ్ కళాశాలలకు కేబినెట్ ఆమోదం తెలుపడంపై కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జడ్చర్లను రెవెన్యూ డివిజన్ చేయాలని, బాలానగర్‌ను మునిసిపాలిటీ చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదివే 200 మంది పేద విద్యార్థులకు నీట్, ఇంజనీరింగ్ ఎంట్రన్స్ కోసం ప్రతీ సంవత్సరం ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి, ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి అన్ని రకాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యేలకు సీఎం భరోసా ఇచ్చారని తెలిసింది. పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే యూనివర్సిటీని సందర్శిస్తానని, పూర్తి నివేదికను తనకు అందించాలని సీఎం వీసీకి సూచించారు.



జాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజీ(ఫైల్)

కొత్త వంట పాత్రలు

- మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలలకు ఇచ్చేందుకు నిర్ణయం
- నారాయణపేట జిల్లాలోని 463 స్కూళ్లకు రూ.66.80 లక్షల నిధులు మంజూరు
- కలెక్టర్ ఆధ్వర్యంలో త్వరలో టెండర్లు

నారాయణపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వంట పాత్రలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు భోజనాలు వండేందుకు వాటిని ఇవ్వనున్నారు. అందుకోసం నారాయణపేట జిల్లాకు రూ.66.80 లక్షల నిధులను మంజూరు చేసింది. ఆ నిధులు జిల్లా విద్యాశాఖ కార్యలయ అకౌంట్‌లో జమ అయ్యాయి. జిల్లాలో 463 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. మొత్తం 59,760 మంది విద్యార్థులకు గాను రోజూ దాదాపు 50 వేల మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. అందుకు ప్రభుత్వానికి రూ.నాలుగు లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే 2010లో ఇచ్చిన వంట పాత్రలు పాతవి కావడం, కొన్ని రంధ్రాలు పడటంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, నాణ్యమైన భోజనాలు వండటం ఇబ్బందికరంగా మారింది. మహిళా సంఘాల సభ్యుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం కొత్త వంట పాత్రలు అందించేందుకు నిర్ణయించింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఛైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌గని కన్వీనర్‌గా, మధ్యాహ్న భోజన నిర్వహణ జిల్లా ఇన్‌చార్జి అధికారి యాదయ్యశెట్టి పర్యవేక్షణలో త్వరలో టెండర్లు నిర్వహించనున్నారు. తద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొనుగోలుకు చర్యలు తీసుకోనున్నారు.

క్లిక్.. క్లిక్..



సేమ్ టు సేమ్

వనపర్తి పట్టణంలోని రాజనగరం శివారులో ఉన్న అమ్మ చెరువులో ఆకాశం ప్రతిబింబం అబ్బురపరిచింది. నింగి చెరువుపై పరుచుకున్నట్లు కనువిందు చేసింది. పాలు చిలికితే నురగ వచ్చినట్లున్న తెల్లని మేఘాలను చెరువుపై చూసిన పలువురు ఔరా! అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' ఆదివారం క్లిక్‌మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి జిల్లా

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా హ్యాండ్‌బాల్ బాలికల జట్టు

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మినీ స్టేడియంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టు ఆదివారం ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 16 మందితో జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో లావణ్య, సౌజన్య, దీక్షిత, బిందుప్రియ, నాగవైష్ణవి, భవిత, శ్రీవల్లి, నందిని, సంధ్య, స్వప్ని, అనూష, శ్రీజ, గీత, దివ్య, నందిని, సౌమ్య ఉన్నారని అసోసియేషన్ కార్యదర్శి శంకర్‌నాయక్ తెలిపారు. వీరు ఆసిఫాబాద్ జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ బాలికల స్కూల్‌లో నవంబరు రెండో తేదీ నుంచి నాల్గో తేదీ వరకు జరిగే 38వ అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సీపీఆర్‌తో ఊపిరి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్


నారాయణపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండె పోటు బారిన పడిన వారిని సీపీఆర్ చేసి, ప్రాణాపాయం నుంచి కాపాడాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో లైఫ్ సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణుల బృందం సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉన్నప్పుడు సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడొచ్చన్నారు. ప్రజలతో మమేకమై ఉండే అధికారులు, పోలీస్ సిబ్బంది సీపీఆర్ ఎలా చేయాలో శిక్షణ తీసుకొని, తమ చుట్టు పక్కల ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ గుండెపోటుతో ప్రాణాలు పోకుండా సీపీఆర్ కాపాడుతుందన్నారు. ఢిల్లీ వైద్యబృందం రాకేష్, అనిల్ మిశ్రా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమస్యలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సీపీఆర్ చేసి చూపించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, రామ్‌లాల్, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.



సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

న్యూస్ బాక్స్

కోయిల్‌సాగర్ నీటిమట్టం 32 అడుగులు



దేవరకద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రం నాటికి 32 అడుగులకు చేరిందని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 32.6 అడుగుల కాగా, ప్రస్తుతం 32 అడుగులకు చేరింది. దీంతో కుడి, ఎడమ కాల్వలకు ప్రస్తుతం నీటిని నిలిపివేశారు. అదేవిధంగా ప్రాజెక్టు నుంచి జిల్లా కేంద్రానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

కొలువును వదిలి..
వెంకన్న సేవకు కదిలి



వట్టెం వెంకన్న ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన పూజలు చేస్తున్న సందడి రంగారెడ్డి, కుసుమమ్మ దంపతులు(ఫైల్)

- ఆధ్యాత్మిక సేవలో సందడి రంగారెడ్డి
- సివిల్ ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా
- జీవితాంతం వట్టెం వేంకటేశ్వర స్వామి సేవ
- కుటుంబమంతా ఆలయ అభివృద్ధిలో మమేకం

కష్టపడి చదివి, ఇష్టంగా సాధించిన ప్రభుత్వ సివిల్ ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తుది శ్వాస వరకు భగవంతుడి సేవలోనే తరించారు. ఆయనే నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన సందడి రంగారెడ్డి. జీవితాంతం వట్టెం వేంకటేశ్వర స్వామి సన్నిధిలోనే గడిపిన ఆయన జీవితం.. ఆధ్యాతిక సేవలో ఆయన ప్రస్థానం తదితరాలపై ప్రత్యేక కథనం..

- బిజినేపల్లి(ఆంధ్రజ్యోతి)



బతుకంతా భగవంతుడి సేవలోనే తరించిన ఆధ్యాత్మిక వేత్త సందడి రంగారెడ్డి జీవితం ఎందరికో ఆదర్శం. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన సందడి రాఘవరెడ్డి, కిష్టమ్మలకు మొదటి సంతానంగా 1940, జూన్ 27న ఆయన జన్మించారు. ఆయనకు ముగ్గురు సోదరులు, ముగ్గురు సోదరిమణులు ఉన్నారు. 1960లో ఉద్యోగంలో చేరి పోచంపాడు ప్రాజెక్టులో విధులు నిర్వర్తించారు. ఆయనకు 1960, ఏప్రిల్ 28న అచ్చంపేట మండలం, బినవోలు గ్రామానికి చెందిన కుసుమమ్మతో వివాహమైంది. సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆయన 1985లో, ఇంకా 13 ఏళ్ల సర్వీసు ఉండగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు.

ఆలయ నిర్మాణానికి సంకల్పం

అప్పట్లో వట్టెం అడ్డగట్టుపై గుడ్లనర్వ గ్రామానికి చెందిన చింతకుంట నరసింహరావు ఆశ్రమం ఏర్పాటు చేసుకొని భజనలు చేస్తూ ఉండేవారు. సందడి రంగారెడ్డికి ఆయనతో పరిచయం ఏర్పడింది. గుట్టపై వేంకటేశ్వర ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించుకున్నారు. అప్పటి మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.నారాయణరావు సహకారంతో అడ్డగట్టుపై ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. ఆలయ అభివృద్ధిలో ఆయననూ భాగస్వామిని చేశారు. వారితో పాటు స్థానికులు బత్తిని మన్యంరెడ్డి, కొర్త చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణలు సహకరించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ద్వారా వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. 1986లో త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. అప్పటి నుంచి 2021, ఆగస్టు ఎనిమిదిన పరమపదించే వరకు స్వామి సేవలోనే తరించారు.

అభివృద్ధికి కృషి

దేవదేవుడి సేవ కోసం ఇంజనీరు కొలువును స్వచ్ఛందంగా వదులుకున్న సందడి రంగారెడ్డి ఆలయ అభివృద్ధిపైనే దృష్టి సారించారు. మృదు స్వభావి అయిన రంగారెడ్డి ఎందరో ప్రముఖులను ఆలయానికి ఆహ్వానించేవారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించేలా కృషి చేసేవారు. 40 ఏళ్ల కాలంలో అడ్డగుట్టపై ఆలయంతో పాటు నిత్యాన్నదాన సత్రం, కల్యాణ మండపం, వసతి గృహాలు, యాగశాల, గోశాల, హరితవనం, త్రిదండి రామానుజాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ, కోనేరుతో పాటు పరిసరాలను అందంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఆలయ అభివృద్ధిలో మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్ రావు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, వ్యాపారవేత్తలు వాస ఈశ్వరయ్య, హకీం మురళి ఆలయ అభివృద్ధికి సహకారం అందించారు. రంగారెడ్డి సోదరులు సందడి ప్రతాప్ రెడ్డి దంపతులు, నరేందర్ రెడ్డి దంపతులు, సురేందర్ రెడ్డి దంపతులు, జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ కమిషనర్‌గా పని చేస్తున్న రెండవ కుమారుడు దేవేందర్ రెడ్డి దంపతులు, అమెరికాలో స్థిరపడిన ముగ్గురు కుమారులు కైంకర్యాలు సమర్పిస్తూ వెంకన్న స్వామి సేవకు అంకితమై ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్నారు.

వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయం

వెంకన్న కొండకు కొండంత అండ

సందడి ప్రతాప్ రెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త : వట్టెం వెంకన్న కొలువైన అడ్డగట్టు కొండకు అన్న రంగారెడ్డి కొండంత అండగా వెలిగారు. ఆయన మా నుంచి భౌతికంగా దూరమైనా వెంకన్న ఆలయ పరిసరాల్లోని అణువణువులో ఉన్నారు. చిన్నప్పటి నుంచి అన్న చూపిన భక్తి మార్గంలోనే మా కుటుంబమంతా కొనసాగుతోంది. ఎందరో పేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన జవహర్ నవోదయ విద్యాలయాన్ని వట్టెం వెంకన్న ఆలయ సమీపంలో ఏర్పాటు చేసేందుకు అప్పటి, ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సహకారంతో కృషి చేసి సఫలీకృతులయ్యారు. గుట్ట పక్కనే నిర్మించిన రిజర్వాయర్‌కు వెంకటాద్రిగా నామకరణం చేయడంలో అన్నయ్య ప్రముఖ పాత్ర పోషించారు.

ఒకే ఒక్కడు

- మహబూబ్‌నగర్ జిల్లాలో 135 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- ఆ టీచర్ రాకుంటే పాఠశాల మూత
- విద్యార్థులకు సరిగా అందని బోధన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏకోపాధ్యాయ పాఠశాలలతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. జిల్లాలోని ప్రాథమిక, పాథమికోన్నత పాఠశాలల సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు పదోన్నతలు రావడంతో చాలా మంది ఉన్నత పాఠశాలలకు వెళ్లిపోయారు. డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయులు వచ్చి చేరినా, దాదాపు 135 స్కూల్స్ ఒకే ఉపాధ్యాయుడితో కొనసాగుతున్నాయి. ఐదో తరగతి వరకు ఒక్కరే పాఠాలు బోధిస్తున్నారు. దాంతో గ్రామీణ, మారుమూల తండా పాఠశాలల్లో బోధన సరిగా అందక చాలా మంది విద్యార్థులు బడి మానేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న ఉపాధ్యాయుడు అత్యవసరమై సెలువుపెట్టాల్సి వస్తే సమీప పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని అక్కడికి పంపాల్సి వస్తోంది. అక్కడి నుంచి ఉపాధ్యాయుడు రాకుంటే ఆరోజు పాఠశాల మూత పడుతుంది. ఇలాంటి చోట కనీసం విద్యా వలంటీర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 614 ఉండగా, ప్రాథమికోన్నత 87, ఉన్నత పాఠశాలలు 136 ఉన్నాయి. విద్యార్థులు లేరని జిల్లా వ్యాప్తంగా 48 పాఠశాలలను మూసివేశారు.

అందని బోధన

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధన అంతంత మాత్రంగానే జరుగుతుందన్న విమర్శలున్నాయి. ఐదో తరగతి విద్యార్థులకు సైతం అక్షరాలు పెట్టి దిద్దిస్తున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. మహమ్మదాబాద్ మండలం బొట్లగడ్డ తండా మారుమూల ప్రాంతంలో ఉంది. అక్కడి పాఠశాల పర్యవేక్షణకు ఇప్పటి వరకు ఒక్క అధికారీ వెళ్లలేదు. ఈ పాఠశాలలో విద్యార్థులే తోటి విద్యార్థులకు చదువు చెప్పడం గమనార్హం. బోరింగ్ తండా పాఠశాలలో సుమారు 20 మంది వరకు పిల్లలు ఉండగా, రెండు భవనాలు ఉన్నాయి. ఈ పాఠశాలకు నాలుగేళ్లగా ఉపాధ్యాయులు రాకపోవడంతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాల భవనాల్లో మేకలు, పశువులను కట్టేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు లేకుండా కొనసాగిస్తున్నాం



జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు గతంలో 189 ఉండగా, డీఎస్సీ -2024 కొత్త ఉపాధ్యాయుల నియామకంతో బాగా తగ్గాయి. ఉన్న వాటిలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బోధన కొనసాగిస్తున్నాం. జిల్లాలో 400లకు పైగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు భర్తీ అయ్యాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నచోట ఏకోపాధ్యాయ పాఠశాలుల కొనసాగుతున్నాయి.

- రవీందర్, డీఈవో మహబూబ్‌నగర్

సోమశిలను సందర్శించిన ఎమ్మెల్సీ

కొల్లాపూర్/పెంట్లవెల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి కృష్ణానది అందాలను ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మిత్రులు కుటుంబ సభ్యులతో కలిసి తిలకించారు. సోమశిల కృష్ణానది తీరాన కాటేజీలలో బస చేసిన వీరు కృష్ణానది అందాలను ఆస్వాదిస్తూ తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నడుస్తున్న ఏసీ లాంచీని మాజీ ఎంపీ కాసేపు ఆటవిడుపుగా నడిపారు. ఏర్పాట్లను జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ పర్యవేక్షించారు. అలాగే, పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో మదనగోపాల స్వామి ఆలయాన్ని ఆదివారం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జటప్రోలులో పురాతనమైన కట్టడాలతో నిర్మించిన ఆలయాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్, గోవింద్‌గౌడ్, కబీరు, మోత్కూరు నాగిరెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణానదిలో లాంచీపై విహరిస్తున్న జితేందర్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా ఉషూ కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌పాషా ఖాద్రి, వాజిద్‌అలీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉషూ నూతన కమిటీని ఆదివారం స్థానిక ఇండోర్‌స్టేడియంలో ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఉషూ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మహ్మద్‌ఇమ్రాన్, ట్రెజరర్ పరమేశ్వర్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సభ్యుడు బాలరాజ్ వ్యవహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జహంగీర్‌పాషఖాద్రీ, వాజీద్‌అలీ, ట్రెజరర్‌గా ఉమర్ బిన్ సలాం, ఉపాధ్యక్షులుగా కనకంయాదవ్, అబ్దుల్‌నబీ, ఇస్మాయిల్, జి. కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీ కేశవ్‌గౌడ్, నాగరాజు, గోపాల్, సయ్యద్ ఖలీల్, సురేందర్, అర్పుత్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా వెంకటస్వామి, శివకుమార్, మోసీన్, వెంకటేశ్, అర్షజమీల్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉషూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా ఉషూ కమిటీ

మాలల చైతన్యం కోసం

ఐక్యంగా పనిచేద్దాం



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాలల ఆత్మీయ సభకు హాజరైన జనం

- మాలలు మీటింగ్ పెట్టుకుంటే తప్పేంటి
- చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి
- నాగర్‌కర్నూల్‌లో మాలల ఆత్మ గౌరవ సభ
- హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఢిల్లీ ఎమ్మెల్యే రాజేంద్రపాల్ గౌతం, రాజేష్ మహాసేన, రెంజర్ల రాజేష్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాల జాతిపై విమర్శలు వస్తే సహించేది లేదని, మాలజాతి చైనత్యం కోసం ఐక్యంగా పనిచేద్దామని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో ఉమ్మడి జిల్లా మాలల ఆత్మసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా గడ్డం వివేక్‌తో పాటు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అంబేడ్కర్ మనవడు, ఢిల్లీ సీమపురి ఎమ్మెల్యే రాంజేంద్రపాల్ గౌతం, బుద్ధవనం ప్రాజెక్టు డైరెక్టర్ మల్లెపల్లి లక్ష్మయ్య, రాజేష్ మహాసేన, రెంజర్ల రాజేష్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ కమ్మ, రెడ్డి ఇలా అన్ని సామాజిక వర్గాల సభలు పెట్టుకుంటే మాలల జాతి ఐక్యం కోసం మీటింగ్ పెట్టుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. దళిత హక్కుల కోసం పోరాటాలు చేసే వారిలో మాలలే ముందుంటారన్నారు. ఇప్పటికి మాలలు అండగా నిలిచిన పార్టీలే అధికారంలోకి వచ్చాయన్నారు. నవంబరు 24న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన మాలల బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదన్నారు. దేశంలో జనాభా లెక్కలు తేల్చి రిజర్వేషన్లు పెంచి శాస్త్రీయ పద్ధతిలో అమలు చేయాలని అన్నారు. ఢిల్లీ ఎమ్మెల్యే రాజేందర్‌పాల్ గౌతం మాట్లాడుతూ దేశంలో బ్రాహ్మణీయ వ్యవస్థను కాపాడుకునేందుకే ఆ సామాజిక వర్గానికి చెందిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పు ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికి నిర్వీర్యం చేసిన బీజేపీ ప్రభుత్వం చివరకు బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను కూడా చీల్చి చిచ్చు పెట్టాలని కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మాల నేత రాజేష్ మహాసేన మాట్లాడుతూ దేశంలో దేశాన్ని పట్టి పీడిస్తున్న ఎయిడ్స్, కోవిడ్ మధ్యలో మందకృష్ణ మాదిగ వైరస్ రెండు తెలుగు రాష్ట్రా లను పట్టి పీడిస్తోందని విమర్శించారు. సభకు వచ్చిన జనాలు చూస్తే తమ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కూడా మాలల్లో ఇలాంటి చైతన్యం రావాలని కోరుకుంటున్నాన్నారు. అనంతరం రెంజర్ల రాజేష్ ఉర్రూతలూరించే మాట, ఆట, పాటలతో సభను ముగించారు. కార్యక్రమంలో సభా కన్వీనర్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, అధ్యాపకులు కందూరు కృష్ణయ్య, సభ సమన్వయకర్త దిగంబర్ కాంబ్లీ, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాజకీయ విశ్లేషకులు డాక్టర్, గోపినాథ్ సీనియర్ జర్నలిస్టు లక్ష్మీనారాయణ, మాల జేఏసీ రాష్ట్ర చెరుకు రాం చందర్, విశ్రాంత ఏఎస్‌పీ యాదయ్య, ఓయూ జేఏసీ కందాల భాస్కర్, శ్రీకాంత్ భీమా, మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన గోవర్ధన్, మామిడి నారాయణ, కళింగ కృష్ణకుమార్, శ్రీకాంత్ భీమా, డాక్టర్ వెంకటేశ్వర్లు, గుడిమల్ల వినోద్, కిషన్, నాయకులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ చైర్మన్‌గా దొడ్ల నర్సయ్య యాదవ్

- 2న ప్రమాణ స్వీకారోత్సవం

అచ్చంపేటటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్‌గా మండల పరిధిలోని అంకి రోనిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొడ్ల నర్సయ్య యాదవ్ ఎన్నికయ్యారు. వచ్చే నెల 2న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వదించాలని కోరారు.

ఒక్క క్లిక్‌తో పాఠశాలల సమాచారం

- యూ డైస్ ప్లస్‌లో విద్యార్థుల సమగ్ర సమాచారం
- జిల్లాలోని 93,359 విద్యార్థులకు (పీఈఎన్) నెంబరు జనరేట్
- ఆధార్ మాదిరిగా విద్యార్థులకు ఆపార్ ఐడీ జారీ

ఖిల్లాఘణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతన జాతీయ విద్యా విధానంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను చేపడుతోంది. యూడైస్‌ప్లస్ (యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) వెబ్‌సైట్‌లో విద్యావ్యవస్థ, పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. విద్యావ్యవస్థ పూర్తి సమాచారాన్ని ఒక చోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఒక్క క్లిక్ చేస్తే పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. 2023-24లో పక డ్బందీగా విద్యార్థులకు ఒక (పీఈఎన్) పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్‌ను కేటాయించారు. దీని ద్వారా విద్యార్థి దేశవ్యాప్తంగా ఏ పాఠశాలలో ఏ తరగతి చదివారని తెలుస్తుంది. యూ డైస్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. అందులో ప్రతీ పాఠశాల సమగ్ర వివరాలను హెచ్‌ఎంలు నమోదు చేయాలి.

సమస్త సమాచారం వెబ్‌సైట్‌లో నిక్షిప్తం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతీ విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో మార్కులతో సహా పొందుపరుస్తున్నారు. అంతే కాకుండా తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు, వైద్య సేవలు సౌకర్యాలకు సంబంధించిన వివరాలతోపాటు వాటి ప్రస్తుత పరిస్థితిని తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ప్రకారం యూనిఫామ్‌లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, పాఠశాల అభివృద్ధికి బడ్జెట్‌ను కేటాయిస్తారు. వనపర్తి జిల్లాలోని 754 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 93, 359 మంది విద్యార్థులకు పీఈఎన్ నెంబరు జనరేట్ చేశారు. ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ప్రీ ప్రైమరీ విద్యార్థులను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు మాదిరిగా విద్యార్థులకు ఆపార్ (ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్టర్ నెంబర్‌తో ఒక ఐడీ కార్డును జారీ చేసే ప్రక్రియ ప్రారంభిస్తుంది. ఇది ఒక విద్యార్థి జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తుంది. ప్రస్తుతం ఎంబీఏ ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు ఆపార్ నెంబర్‌ను జనరేట్ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే విద్యార్థులకు సంబంధించిన తప్పుడు సర్టిఫికెట్లు అంతమవుతాయి. కానీ ఆపార్ నెంబర్ జనరేట్ కావాలంటే ఆధార్ కార్డు, ఆన్‌లైన్‌లో విద్యార్థి పేరు ఒకటే ఉండాలి.

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి పెద్దపీట

- సీఎం చొరవతో స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలు, విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనివర్సిటీని, యువతకు ఉపాధి కోసం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఆయన కల్వకుర్తి పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో మూడురోజుల పాటు జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, అండర్ 19 స్పోర్ట్స్‌మీట్‌ను ఎమ్మెల్యే తన సతీమణి మాధవిరెడ్డితో కలిసి ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌కు 16 గురుకులాలు, 8 జూనియార్ కళాశాలల నుంచి 1190 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ, క్రీడ, గురుకులాల జెండాలను ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని క్రీడాకారులకు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులు శ్రద్ధతో చదవాలని సూచించారు. అంతకుముందు గురుకులంలోని వంటశాలను, విద్యార్థులకు వండే ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ జి.మాధవరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, జీ రాములు, బొమ్మ అంజనేయులు, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, వెంకటేశ్, ప్రిన్సిపాల్స్ నాగమణి, దమయంతి, పలువురు పీడీలు, పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

ఏఎన్‌ఎం పోస్టులు ఇప్పిస్తా

- కాల్ చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

గద్వాల క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హలో రేణుక.. మీరు ఏఎన్‌ఎంకు దరఖాస్తు చేసుకున్నారు కదా.. మీకు ఉద్యోగం కావాలంటే రూ.50వేలు చెల్లించాలని ఫోన్ వస్తుంది. అప్పుడు రేణుక అనే యువతి మీరు ఎవరు సార్ ఎక్కడి నుంచి ఫోన్ చేస్తున్నారంటే నేను జాబ్ సెలక్షన్ కమిటీ మెంటర్‌ను మాట్లాడుతున్నాను. మీకు ఇప్పుడు వేసిన నోటిఫికేషన్ కాంట్రాక్ట్‌కు సంబంధించినవి, అయితే వాటిని రెగ్యులర్ చేసేందుకు చూస్తున్నాం. నేను మెంబర్‌ను కాబట్టి నాకు తెలుసు. మీరు బీసీ 'బీ' నేను బీసీ 'బీ' కాబట్టి మన కులం అని చెబుతున్నాను. మీరు మనకులం కాబట్టి కేవలం రూ. 50వేలు చెల్లిస్తే సరిపోతుంది. ఇతర కులాలు అయితే రెండు లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. మీరు రూ. 50 వేలు కూడా మొదట రూ. 25వేలు ఫోన్‌పేలో నా నెంబరు 9163026275కు పంపిస్తే నీ మొయిల్‌కు మెరిట్ లిస్టను పంపిస్తాం. అప్పుడు మీరు ఇంకా రూ. 25వేలు చెల్లిస్తే మీకు జాయినింగ్ ఆర్డర్ పంపిస్తాము. నీవు కలెక్టరేట్‌లో బయట మాకు సంబంధించిన వ్యక్తి ఇస్తాడు. ఆ లెటర్ తీసుకెళ్లి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇస్తే వెంటనే జాయినింగ్ ఆర్డర్ ఇస్తాడు. ఇలా చాలా మందికి కాల్స్ వచ్చినట్లు సమాచారం.

ఒకే నంబరు నుంచి వస్తున్న కాల్స్

జోగుళాంబ గద్వాల జిల్లాలోని వైద్యశాఖ ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం తొమ్మిది ఏఎన్‌ఎం పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 450 మంది దాకా దరఖాస్తు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో మెరిట్ లిస్టును అధికారులు బోర్డుపై వేయడంతో పాటు ఆన్‌లైన్‌లో ఉంచడంతో సైబర్ నేరగాళ్లు రంగప్రవేశం చేశారు. ఓ అగంతకుడు వెంటనే తెలుగులో మాట్లాడుతూ మీకు ఉద్యోగం కావాలంటే రూ. 50వేలు ఇవ్వాలని, ఇందులో మొదట రూ. 25వేలు, తర్వాత రూ. 25వేలు ఇవ్వాలని 91630 26275 నుంచి ఫోన్‌లు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమందికి జాయినింగ్ ఆర్డర్‌లు కూడా ఇవ్వడం జరిగిందని, పోటీ ఎక్కువగా ఉందని, వెంటనే డబ్బులు ఇస్తే మీకు కూడా త్వరగా ఇస్తామని చెప్పడంతో కొందరు డబ్బులు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. మూడు రోజుల నుంచి వందల సంఖ్యలో కాల్స్ వస్తున్నాయని, కొందరు ఈ విషయాన్ని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌వో కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు తెలిపినా కూడా ఆ వ్యక్తి నుంచి ఫోన్‌కాల్స్ ఆగడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఎవరినీ నమ్మొద్దు : డీఎంహెచ్‌వో

ఏఎన్‌ఎం ఉద్యోగాలు మెరిట్ ఆధారంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగాలు ఇస్తాం. ఉద్యోగాలు ఇప్పిస్తామని కాల్ చేసే వారి మాటలు నమ్మి మోసపోవద్దు . ఇది కూడా ఒక విధమైన సైబర్ నేరమే... ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా కార్యాలయంలో సంప్రదించాలి.

నాయినోనిపల్లి మైసమ్మ దర్శనం కోసం

పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినేనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగు బంగారంగా వెలిసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు పోటెత్తారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచి కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం దాదాపు 20వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల నుంచి ఆదివారం హుండీ ద్వారా రూ.77,030, టికెట్ల ద్వారా రూ. 48,825, మొత్తం రూ. 1,17, 55000 మైసమ్మ దేవత ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రాజేశ్వర్‌శర్మ తెలిపారు.



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కల్వకోలు గ్రామంలో శనివారం రాత్రి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకోలు గ్రామానికి చెందిన పట్నం శివ(21) శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం కోసం పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేట కొడవలితో భార్యపై భర్త దాడి

» అడ్డుగా వెళ్లిన అత్త పరిస్థితి విషమం

దేవరకద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త వేటకొడవలితో దాడి చేయగా గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన అత్త తలకూ తగలడంతో తీవ్ర గాయాలై ఆమె పరిస్థితి విషమంగా మారింది. ఈ సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడిబండ గ్రామానికి చెందిన నిర్మల కూతురు లక్ష్మిని మదనపురం మండలం కొన్నూర్ గ్రామానికి చెందిన కురుమూర్తికి 17 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం జరిపించారు. భార్యాభర్తలు ఇద్దరు హైదరాబాద్‌లో కూలి పని చేస్తూ జీవనం సాగించేవారు. వారికి ఇద్దరు సంతానం. అక్కడ పని చేసే చోట భార్యపై భర్తకు అనుమానం రావడంతో 15 రోజుల కిందట గొడవపడి భర్త హైదరాబాద్ నుంచి తన సొంత గ్రామానికి వచ్చాడు. తన పిల్లలతో కలిసి 15 రోజుల నుంచి కూలీ పని చేస్తుండగా లక్ష్మి తల్లికి ఈ విషయం తెలిసింది. హైదరాబాద్ నుంచి నువ్వు ఇంటికి రా.. నీ భర్తతో మాట్లాడి పంపిస్తా అని చెప్పింది. దీంతో లక్ష్మి తన తల్లి దగ్గరకు గుడిబండ గ్రామానికి శనివారం చేరుకుంది. ఆదివారం ఉదయం నిర్మల తన అల్లుడికి ఫోన్ చేసి నీ భార్యని తీసుకెళ్లమని చెప్పడంతో ఆవేశంగా ఇంటికి వచ్చాడు.. తన వెంట తెచ్చుకున్న కొడవలి తో భార్యపై దాడి చేయగా, స్వల్ప గాయాలయ్యాయి.

అడ్డుగా వచ్చిన అత్త తల్లకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గాయాలైన నిర్మలను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

పట్టపగలు అన్నాదమ్ముల ఇళ్లలో చోరీ

» ఐదు తులాల బంగారం, రూ.35 వేల నగదు

బిజినేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మహాదేవునిపేట గ్రామంలో ఆదివారం పట్టపగలే అన్నాదమ్ములకు చెందిన రెండు ఇళ్ల తలుపులు, బీరువాలు పగల గొట్టి ఐదున్నర తులాల బంగారం, 12 తులాల వెండి గొలుసులు, రూ.35 వేల నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితులు పొలమోని బాలస్వామి, పెద్ద మార్కొండయ్యలు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి. రోజులాగే పత్తి తీసేందుకు కూలీలతో పాటు ఇళ్లకు తాళాలు వేసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళాలు, తలుపు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాను ధ్వంసం చేసి బాలస్వామి ఇంట్లో మూడున్నర తులాల బంగారం, రూ. 20 వేల నగదు, పెద్ద మార్కొండయ్య ఇంట్లో 2 తులాల బంగారం, 12 తులాల వెండి గొలుసులు, రూ. 15 వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ కె.శ్రీనివాస్ క్లూస్ టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

ఉప్పునుంతల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ పేలి గుడిసె దగ్ధం అయిన సంఘటన ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో చోటుచేసుకొంది. గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్‌లక్ష్మయ్య తన ఇంటి ముందు వంట కోసం గుడిసె ఏర్పాటు చేసుకున్నాడు. భార్య ఒడిబియ్యం పెట్టుకోవడానికి వేరే ఊరికి వెళ్లింది. బాల్‌లక్ష్మయ్య చిన్నమ్మ అయిన లక్ష్మమ్మ స్నానం చేసేందుకు సిలిండర్‌పై వేడి నీళ్లు పెట్టుకొని ఆఫ్ చేయకుండా మరిచిపోయింది.

ప్రమాదవశాత్తు సిలిండర్ పేలడంతో గుడిసెలో ఉన్న మరో సిలిండర్ పేలడం, గుడిసె పూర్తిగా దగ్ధం అయిన్నట్లు బాధితుడు తెలిపారు. ఇంట్లో వంట పాత్రలు, బియ్యం దాదాపు 30 వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని వారు తెలిపారు.

ఉపాధి ఫలాలు

» సత్ఫలితాలిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్

» నవాబ్‌పేట మండలంలో విరివిగా ఫలాలు లభ్యం

» రైతుల నుంచి పండ్ల సేకరణ



గుజ్జును పరిశీలిస్తున్న డీపీఎం నాగమల్లిక



గుజ్జును ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

నవాబ్‌పేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో ఎలాంటి ఉపాధి వనరులు లేకపోవడంతో నిత్యం హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు నిత్యం వలస వెళ్తున్న పేద జీవులకు మండలంలో ప్రకృతి పుణ్యమా అంటూ సుమారు రెండు నెలల పాటు ఉపాధి లభిస్తుంది. ఇక్కడ ఉచితంగా దొరికే సీతాఫలానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. చిన్న, పెద్దా తేడా లేకుండా ఉదయం నుంచి సాయంత్రం గుట్టలు, చెట్లు వెంబడి తిరిగి సీతాఫలం సేకరించి నాలుగురాళ్లు పోగు చేసుకుంటూ అటు ఉపాధి.. ఇటు ఆరోగ్యం సంపాదించుకుంటున్నారు. ప్రకృతిలో లభించే సీ తాఫలం నుంచి ఆదాయం సమకూర్చుకోవాలన్న ఆలోచనతో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా గుజ్జు తయారీ కేంద్రం ఏర్పాటు చేసి తమకు అవసరమైన మేర ఫలం సేకరిస్తున్నారు. కూలీలు, రైతుల నుంచి సీతా ఫలాలను నాణ్యతను బట్టి కిలోకు రూ.10 నుంచి రూ.15 కేంద్రం నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన ఫలాలను ప్రాసెసింగ్ యూనిట్‌లో రెండు రోజులు మాగపెట్టి, గుజ్జును వేరు చేస్తున్నారు. అనంతరం ఆ గుజ్జును కిలో చొప్పున ప్యాకింగ్ చేసి, ఐస్‌క్రీం కంపెనీలకు రూ.180 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. రోజూ 40 మంది పని చేస్తుండగా, ఒక్కొక్కరికి రూ.400 చొప్పున కూలీ చెల్లిస్తున్నారు.

● పుష్కలంగా సీతాఫలం చెట్లు ...

మండలంలో మెట్ట ప్రాంతంతో పాటు గుట్టలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ సీతాఫలం వనాలు ఎక్కువస్థాయిలో ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం సమీప మండలాలైన నవాబ్‌పేట, చౌడాపూర్, మహబూబ్‌నగర్, హన్వాడ, కోయిలకొండ, మహ్మదాబాద్, జడ్చర్ల తదితర మండలాల్లో అధిక సంఖ్యలో ఈ చెట్లు ఉన్నాయి. ప్రతి వర్షాకాలంలో జూన్ నెలలో సీతాఫలంకొచ్చి ఆగస్టు మొదటి చివరి వారం నుంచి ఖాత మొదలవుతుంది. దీంతో గ్రామాల్లో సీతాఫలం సేకరణ ప్రారంభమవుతుంది.

● ఔషధ గుణాలెన్నో...

ప్రకృతి ఒడిలో లభించే సీతాఫలం నుంచి ఎన్నో లాభాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సీతాఫలం తింటే విటమిన్ ఎ,బీ,సీ,కే, ప్రొటీన్స్, క్యాల్షియం, పాస్ఫరస్, మెగ్నీషియం, కాపర్, ఫైబర్, ఇనుము, వంటి ఖనిజాలు పుష్కలం.

● విటమిన్-ఏతో కంటి చూపు, చర్మ, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపడంతో పాటు అధిక బరువు తగ్గిస్తుంది. అలాగే కడుపుబ్బరం, అజీర్తి, అల్సర్ జీర్ణాశయ సమస్యలనుంచి విముక్తి, సీతాఫలంను తినడం వల్ల గర్భశ్రవం నివారిస్తుంది. గుండె వ్యాధులు అధిక రక్తపోటు నివారిస్తుంది. గర్భిణులలో దంత సమస్యలనుంచి రక్షిస్తుంది. మలబద్ధకం నివారించడంతో పా టు శిశివు యొక్క రోగనిరోధక వ్యవస్థ, నాడి వ్యవస్థ, మెదడు అభివృ ద్ధికి సహాయ పడుతుందని పలువురు వైద్యులు తెలుపుతున్నారు.



సీతాఫలం నుంచి గుజ్జు తీస్తున్న మహిళలు

● మహిళలకు ఉపాధి...

సీతాఫలం గుజ్జు సేకరణతో గ్రామాల్లో సుమారు రెండు నెలలు ఉపాధి దొరుకుతుంది. ప్రతీ గ్రామం నుంచి తమ వద్దకు వచ్చే సీతాఫలం నాణ్యతను బట్టి డబ్బులు చెల్లిస్తాం. ప్రతీ ఏడాది వ్యాపారం వృద్ధి చేస్తున్నాం. ఏటా రూ.5 లక్షల వరకు క్రయ విక్రయాలు జరుపుతున్నాం. మున్ముందు గ్రామాల్లో గుజ్జు తయారీ కేంద్రాలు విస్తరించి మహిళలకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తాం.



- జీవరత్నం, ఏపీఎం



గుజ్జు తీస్తున్న మహిళ

● విస్తరిస్తున్న కొనుగోలు కేంద్రాలు...

మండలంలో ఒకప్పుడు సీతాఫలం విక్రయ కేంద్రాలు చాలా తక్కువ. కానీ ఇప్పుడు మహబూబ్‌నగగర్, మహ్మదాబాద్ రేంజ్‌లలో పలు గ్రామాల్లో గ్రామస్థులు సమూహంగా ఏర్పడి సీతాఫలం క్రయ విక్రయాలు చేస్తున్నారు. ఇక్కడి సీతాఫలం కర్నూల్, కడప, బెంగళూర్, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

● గుజ్జు తయారీ ఇలా...

మహిళా సంఘాల ఆధ్వర్యంలో సీతాఫలం గుజ్జు తయారీ గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతుంది. అయితే ప్రతి ఏడాది సుమారు రూ. 5 లక్షల వ్యాపారం సాగుతోందని మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారు. సుమారు రెండు నెలల పాటు గుజ్జు సేకరణ పనులు కొనసాగుతాయని, నిత్యం ప్రత్యక్షంగా 40 మంది, పరోక్షంగా మరో 50 మందికి తాము ఉపాధి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

పక్వానికి (పండుదశకు) వచ్చిన కా యలను సేకరించి వాటి నుంచి విత్తులు, గుజ్జు తీసి ప్రత్యేక పాకెట్లలో భద్రపర్చి హైదరాబాద్, విజయవాడ, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఐస్‌క్రీం వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.



ఫ్రిజ్‌లో గుజ్జును భద్రపరుస్తున్న మహిళ

కురుమూర్తి స్వామికి పట్టు వస్త్రాల తయారీ ప్రారంభం

» వస్త్రాల తయారీ పూజకు హాజరైన మాజీ ఎమ్మెల్యే స్వర్ణాసుధాకర్‌రెడ్డి

అమరచింత, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి సమర్పించే పట్టు వస్త్రాల తయారీ పనులు ఆదివారం అమరచింతలో ప్రత్యేక పూజల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణంలో పద్మశాలీలు ప్రత్యేక మగ్గాన్ని ఏర్పాటు చేసి ఆనవాయితీ ప్రకారం ప్రతీ ఏడాది మాదిరిగా ఈసారి కూడా స్వామి వారికి వస్త్రాలను సమర్పించనున్నారు.

పట్టు పంచె, పట్టు కండువాతో పాటు, పద్మావతి అమ్మ వారి కోసం పట్టు చీర, పట్టు రవికే తదితర వస్త్రాలను తయారు కోసం మగ్గంతో పాటు పట్టు వస్త్రాల ముడిసరుకు కురుమూర్తి స్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పగడాకుల కురుమన్న దంపతులు ప్రత్యేక పూజలో కూర్చు న్నారు. నిర్ణీత ముహూర్తానికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు నిష్ఠతో మగ్గంపై పారుపల్లి శ్రీను, ఒగ్గు రవిలు పట్టు వస్త్రాల నేత పనిని ప్రారంభించారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు, నేత పనిని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే స్వర్ణాసుధాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల మధ్య ప్రారంభమైన స్వామి వారి పట్టు వస్త్రాల నేత పని వచ్చే నెల 6వ తేదీ కురుమూర్తి స్వామి వారి ఆభరణాల ఊరేగింపు సమయానికి పూర్తి చేస్తారు. నేసిన పట్టు వస్త్రాలను కాంచన గృహలోని కురుమూర్తి స్వామి వారికి చేనేత కార్మికులు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు చేనేత కార్మికులు దేవరకొండ లచ్చన్న, పారుపల్లి చింతన్న, మేర్వ రాజు, దేవరకొండ మోహన్, మహంకాళి చంద్రమోహన్, క్యామ శ్రీను, తిరుమల వెంకటేష్, వీరన్న, రామలింగం, వెంకటేష్, మాగనూరు రాజు తదితరులు పాల్గొన్నారు.



మగ్గానికి పూజ చేసి పట్టు వస్త్రాల నేతనం ప్రారంభిస్తున్న చేనేత కార్మికులు

చాంపియన్ మహబూబ్‌నగర్

» అండర్-23 క్రికెట్‌లో ఘన విజయం » రన్నర్‌గా నిలిచిన నాగర్‌కర్నూల్

స్పోర్ట్స్ న్యూస్



రన్నర్‌గా నిలిచిన నాగర్‌కర్నూల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఉమ్మడి జిల్లా అండర్- 23 క్రికెట్ టోర్నీలో చాంపియ న్ మహబూబ్‌నగర్, నాగర్‌క ర్నూల్ జట్టు రన్నర్‌గా నిలి చింది. ఆదివారం బోయపల్లి సమీపంలో ఎండీసీఏ మైదా నంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో మహబూబ్‌నగర్ జట్టు 203 పరుగుల తేడాతో నాగర్‌ర్నూల్ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యా టింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 91 బంతుల్లో 13 ఫోర్లు ఒక సిక్స్‌తో అర్ధసెంచరీ (95) చేయగా, అక్షయ్ 104 బంతుల్లో 17 ఫోర్లు, ఒక సిక్స్‌తో సెంచరీ(118) సాధించాడు. నాగర్‌కర్నూల్ బౌలర్లలో అభినవ్‌తేజ, అఫ్రిది, జశ్వంత్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నాగర్‌కర్నూల్ జట్టు 24.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో వంశీ 28, అఫ్రిది 15 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖిత్ 3, అర్జున్, దినేశ్ చెరో వికెట్లు తీసి జట్టు విజయానికి బాటలు వేశారు. టోర్నీలో 246 పరుగులు చేసి అక్షయ్ ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, 8 వికెట్లు తీసి ముఖిత్ బెస్ట్ బౌలర్‌గా, 197 పరుగులు, 5 క్యాచ్ అవుట్ చేసిన అబ్దుల్‌రాఫె ఉత్తమ అల్ రౌండర్‌గా ఎంపికయ్యారు.

క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలి

క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రాణించి రాష్ట్ర జట్టుకు ఎంపికవాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. టోర్నీలో ఫైనల్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు రోజులుగా ఆయా జట్ల క్రీడాకారులు చక్కటి ప్రతిభ చాటారని, క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకా రులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని, త్వరలో జరగనున్న హెచ్‌సీఏ టోర్నీలో జట్టు పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి జిల్లా జట్టు ప్రతిభ చాటాలని ఆకాక్షించారు. సురేష్‌కుమార్, వెంకటరామరావు, కృష్ణమూర్తి, కోచ్‌లు గోపాల్‌కృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

పాలమూరులో క్రీడా సంబురం

» నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీ

» పాల్గొననున్న 10 జిల్లాలు, 360 మంది క్రీడాకారులు

» టోర్నీని ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు

» ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



స్టేడియంలో టోర్నీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి క్రీడా సంబురానికి వేదికానుంది. నేటి నుంచి మహబూబ్ నగర్ స్టేడియం మైదానం, ఇండోర్ స్టేడియంలో నేటి నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర అంతర్‌జిల్లాల బాల, బాలికల ఖోఖో టోర్నీ జరగనున్నది. మూడు రోజుల పాటు పట్టణ ప్రజలకు కనువిందు చేయనున్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి విలియం టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బాలికలకు మాడ్రన్ స్కూల్, బాలురకు చైతన్య, బీపీ హెచ్‌ఎస్‌స్కూల్, స్టేడియంలో బస, బాలభవన్‌లో భోజన వసతి కల్పిస్తున్నారు.

టోర్నీకి ఏర్పాట్లు పూర్తి

తెలంగాణ రాష్ట్ర అంతర్‌జిల్లాల బాల, బాలికల అండర్-16 బాల,బాలికల ఖోఖో టోర్నీకి స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 10 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులకు, ఆఫిషియల్స్‌కు బస, భోజన వసతికి కల్పిస్తున్నాం. టోర్నీని అందరి సహకరంతో విజయవంతంగా నిర్వహిస్తాం.

- జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి విలియం

పాల్గొననున్న 10 జిల్లా జట్లు...

తెలంగాణ రాష్ట్ర అంతర్‌జిల్లాల బాల, బాలికల ఖోఖో టోర్నీలో రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు, ఆఫీషియల్స్ పాల్గొను న్నారు. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్ జట్లు పాల్గొనున్నాయి. తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల బాల, బాలికల ఖోఖో పోటీలకు ఉదయం 11 గంటలకు తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అరునిధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు.

అవినీతికి కేరాఫ్.. హెచ్‌సీఏ

» జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధిని పట్టించుకోలేదు

» శాట్ మాజీ చైర్మన్, టీడీసీఏ అధ్యక్షుడు ఏ వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతికి కేరాఫ్ అడ్రాస్‌గా మారిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఫౌండర్, అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 80 ఏళ్ల చరిత్రలో తెలంగాణ (హైదరాబాద్ మినహాయింపు) జిల్లాల నుంచి పట్టుమని ఐదుగురు క్రీడాకారులు రంజీ ఆడలేదని, జిల్లాలో క్రికెట్ అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. హైదరాబాద్, రం గారెడ్డి జిల్లాలకు 216 క్లబ్‌లు, జట్లు ఉన్నాయని, మిగిలిన 8 జిల్లాలకు 8 జట్లు ఉండటం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మహా రాష్ట్ర మూడు, గుజరాత్ మూడు సంఘాలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలకు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలని బీసీసీఐకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఇటీవలే కలిసి వినతి పత్రం అంద జేశామని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ కేసీఆర్‌ను కలుస్తామని చెప్పారు. హైదరాబాద్ ఇతర జిల్లాల క్రికెటర్ల ప్రగతి కోసం టీడీసీఏకు సభ్యత్వం ఇవ్వాలన్నారు. హెచ్‌సీఏ లీగ్స్ పే, ప్లే రీతితో మారిపోయి, గ్రామీణ క్రికెటర్లు ఈ రాజకీయాలతో ఎదగలేకపోతున్నారని ఆరోపించారు. ప్రత్యేక అసోసియేషన్ ఏర్పాటుతోనే 8 జిల్లాల క్రీడాకారులకు న్యాయం జరుగుతుందని, జిల్లాలో క్రికెట్ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఆ దిశగా టీడీసీఏ ముందుకు వెళుతుందని వెల్లడించారు. సమావేశంలో సీనియర్ క్రీడాకారులు రఘువర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, నవీన్, రియాజ్, సంతోష్‌కుమార్, రశీద్, నవజ్‌షా, రాంచందర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

- జడ్చర్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పల్యావత్ రాజేందర్

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల లైసెన్స్‌దారులు, నిబంధనలు పాటించక పోతే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే లైసెన్స్‌లను రద్దు చేస్తామని జడ్చర్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పల్యావత్ రాజేందర్ తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

టపాకాయల దుకాణదారులు ఎలాంటి నిబంధనలు పాటించాలి?

టపాకాయల దుకాణాలను జనావాసాలు లేని ఖాళీస్థలంలో ఏర్పాటు చేసుకోవాలి. వారికి ఈ-లైసెన్స్‌లు తాత్కాలికంగా జారీ చేస్తాము. జడ్చర్లలో నవంబర్ 11వ తేదీ వరకు దుకాణాలు నిర్వహించేలా లైసెన్స్‌లు జారీ చేశాము.

నిబంధన పాటించకపోతే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జడ్చర్లలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసుకుంటున్న ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్‌లు జారీ చేశాము. 50మీటర్ల నిబంధన అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాము. ప్రతి దుకాణంలో వంద కిలోల మేరకు మాత్రమే స్టాకు ఉండాలన్న నిబంధన పాటించాలి. ఈ అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాము.

దుకాణాల ఏర్పాటుకు ఏయే నిబంధనలు పాటించాలి?

రేకులషెడ్‌లతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక్కో దుకాణానికి మూడు మీటర్ల దూరం పాటించాలి. రెండు వందల లీటర్ల సామర్థ్యం గల రెండువాటర్ బ్యారళ్లను, ఆరు బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి. వీటిలో మూడు బకెట్లను ఇసుకతో, మరో మూడు నీళ్లతో ఉన్నవి ఏర్పాటు చేసుకోవాలి.

అగ్నిప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అగ్నిప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందే. ఆయిల్ బర్నింగ్ ల్యాంప్స్, గ్యాస్ ల్యాంప్స్ తదితర వాటిని విద్యుత్ కోసం ఏర్పాటు చేసుకోరాదు. అలాగే బీడీ, సిగరెట్ తాగడం పూర్తిగా నిషేధించాలి. విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసుకున్న ఎలక్ట్రికల్‌వైర్లు ఏర్పాట్ల అంశంపై పూర్తి జాగ్రత్తలు చేపట్టాలి.

న్యూస్ బాక్స్

కోయిలకొండను ముడాలో కలుపవద్దు

కోయిలకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వలసలు పోయే మండలంగా ఉన్న కోయిలకొండను ముడాలో కలిపితే ప్రజలు నష్టపోతారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ కోయిలకొండ మండలంలోని గ్రామాలను ముడా పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరారు. అత్యంత పేదరికంలో ఉన్న గ్రామాలు ఉన్నాయని ముడాలో కలుపడం ద్వారా ఇక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ముడా నుంచి గ్రామాలను తొలగించే వరకు నిరసనలు తెలుపుతామని అన్నారు.

పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బుచ్చారెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా వి.బుచ్చారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి బుచ్చారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, గోపాల్‌నాయక్, తిమ్మారెడ్డి, అశ్విని చంద్రశేఖర్, శ్రీహరి తదితరులు అభినందించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏ.రాములు

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం పట్టణ 9వ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 523 సర్వే నెంబర్‌లో పట్టాలు తీసుకుని, నేటికీ లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. దివిటిపల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గరకు ప్రజలు వెళ్లటానికి రవాణాకు బస్సు, రైల్వేస్టేషన్ దగ్గర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు.

నేడు ప్రజావాణి

దేవరకద్ర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి

- మండలంలో 490 ఎకరాల్లో సాగు
- అంతరపంటగా పల్లి, మొక్కజొన్న, కంది, పత్తి
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకొస్తున్న పలువురు రైతులు



నవాబుపేట శివారులో సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోట



రైతుకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి

నవాబ్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుపై మండలంలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. కారూర్ గ్రామానికి చెందిన రైతు అనంతయ్య ఒకప్పుడు సుమారు 15 ఎకరాల్లో పత్తిసాగు చేసేవాడు. కానీ నేడుపత్తి సాగుకు కూలీలు, సాగుబడి ఎక్కువవడంతో ఆయన సుమారు 10ఎకరాల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్‌పాం సాగుచేశారు. ఇది ఒక్క అనంతయ్యనే కాదు చాలామంది ఇదే దారిలో నడుస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండడంతో మండలంలో సుమారు 120మంది రైతులు, 490 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టారు.

ఆంధ్రాలో చూసి సాగువైపు..

మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన నర్సింహులు ఆర్టీసీ డ్రైవర్. తరచూ ఆంధ్రాకు వెళ్లేవారు. అక్కడి రైతులు చేపట్టిన ఆయిల్‌పాం సాగును చూసి, వివరాలు తెలుసుకుని 2020లో ఉద్యానవన, వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలతో పది ఎకరాల్లో సాగు చేపట్టారు. అనంతరం ఒక్కొక్కరుగా రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెడుతున్నారు.

బహిరంగ మార్కెట్‌లో ధరలు పైపైకి..

మార్కెట్‌లో ఆయిల్‌పాం గెల ధరలు అధికంగా ఉన్నాయి. టన్ను ఆయిల్‌పాం గెలకు రూ.14,300 నుంచి రూ.17,300 వరకు ఈనెలలో ధర పలుకున్నది. దీంతో రైతులకు ఇది ఎంతో లాభదాయకమని అధికారులు చెబుతున్నారు.

అంతర పంటలకు అనుకూలం..

ఆయిల్‌పాం తోటలు నాటిన తర్వాత నాలుగేళ్ల వరకు దిగుబడి రానందు వల్ల, అప్పటి వరకు అంతర పంటలు వేసుకుంటూ ఆదాయం పొందుతున్నారు. మండలంలోని 19 గ్రామాల్లో నాటిన ఈ తోటలలో వేరుశనగ, మొక్కజొన్న, కంది, పత్తి ఇతర పంటలను రైతులు సాగుచేస్తున్నారు.

పంట బాగుంది..



నేను వృత్తి రిత్యా డ్రైవర్ కావడంతో ఆంధ్రా ప్రాంతంలో 2020లో పర్యటించినప్పుడు నా స్నేహితులు కొందరు ఈ పంట సాగు గురించి చెప్పారు. అనుకున్న వెంటనే ఉద్యానవన అధికారులను సంప్రదించాను. వాళ్లు నా పొలం పరిశీలించి ఎకరాకు 50మొక్కల చొప్పున నాటారు. ప్రస్తుతం దిగుబడి బాగుంది. నెలకు సుమారు 5నుంచి 10క్వింటాళ్ల గెలలు మార్కెట్‌లో విక్రయిస్తున్నాను. క్వింటా రూ.17,000ల పైనే ఉంది. ఈ పంటతో నెలనెలా ఆదాయం సమకూరుతున్నది. తోటి రైతులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

- నర్సిములు కారుకొండ

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



రైతులు ఆయిల్‌పాం తోటలు నాటాలంటే ముందుగా ఉద్యానవన శాఖ, ప్రీ యూనిక్ ఇండియా కంపెనీ ప్రతినిధిని సంప్రదించాలి. తర్వాత మేము పొలాన్ని పరిశీలిస్తాము. ఎలా సాగు చేయాలో అవగాహన కల్పిస్తాము. ఎకరాకు రూ.1,140 చెల్లిస్తే, 50 మొక్కలను అందజేస్తాము. అలాగే డ్రిప్‌నకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, చిన్న సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీ 7శాతం జీఎస్టీ, పెద్ద రైతులకు 80శాతం సబ్సిడీ చెల్లిస్తారు. నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.4500 ప్రభుత్వం అందజేస్తుంది.

- మహేందర్, ఉద్యానవన అధికారి, జడ్చర్ల

ప్రతి గ్రామంలో గోపాష్టమి నిర్వహించాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో గోపాష్టమి కార్యక్రమాలు నిర్వహించాలని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా శ్రీగణేష్ భవనంలో వీహెచ్‌పీ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దీపావళి పండుగ అనంతరం వచ్చే అష్టమి రోజున గోపాష్టమి వేడుకలు నిర్వహించాలని, గోమాతకు పూజ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, తెలంగాణ ప్రాంత కార్యదర్శి సభ్యుడు వెంకన్న మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో కమిటీల ఆధారంగానే మాతృశక్తిని, దుర్గాశక్తిని, బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కార్యఅధ్యక్షుడు చంద్రయ్య, కోశాధికారి శ్రీధర్, బాబు, హనుమంతు, శ్రీనివాస్, భజరంగ్‌దళ్ వంశీ, కుమార్, శ్రీకాంత్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలి

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన పద్మశాలీలు

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించటం మంచి సాంప్రదాయమని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అయ్యప్పకొండ పద్మావతి కాలనీ శ్రీ శివ మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ, నీట్ ప్రవేశ పరీక్షలో, ఉన్నత విద్యలో ప్రతిభ, అత్యధిక మార్కులు సాధించిన వారిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు, సత్కారం, పారితోషికం, సర్టిఫికెట్, మెమెంటోలు అందజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శిరందాసు, యాదగిరేందర్, లక్ష్మిపతి, రాజేశ్వర్, బాలరాజు పాల్గొన్నారు.

రేపు చెస్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)27: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు ఆల్ ఇండియా సౌత్ జోన్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 29న స్త్రీ, పురుషులకు చెస్, పురుషుల విభాగం టేబుల్ టెన్నిస్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు శనివారం పీయూ పీడీ శ్రీనువాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి చెన్నైలో వెల్‌టెక్ యూనివర్సిటీలో చెస్ పోటీలకు, తమిళనాడులోని వీఐటీ యూనివర్సిటీలో టేబుల్ టెన్నిస్ సౌత్‌జోన్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

సిరి సీడ్‌తో వరిలో అధిక దిగుబడి



అంకిళ్లలో సాగు చేసిన సిరి వరి పంటను పరిశీలిస్తున్న రైతులు

కోయిలకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిరి వరి సీడ్‌తో ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఎండీ అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంకిళ్లలో సిరి సీడ్ వేసిన రైతుల పొలాల్లో వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సీడ్ పంటకు తెగుళ్లను తట్టుకొనే శక్తి ఉందన్నారు. కంకి ఏపుగా పెరిగి దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. అంకిళ్ల, అయ్యవారిపల్లి, చందాపూర్ రైతులు వానాకాలంలో సాగు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాములు, సుదర్శన్‌రెడ్డి, రవినాయక్, భీంరెడ్డి, చెన్నారెడ్డి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకు నీటి సరఫరా బంద్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం మల్లెబోయినిపల్లి నీటిశుద్ధి కేంద్రానికి మొత్తం 40 గంటలు నేడు ఉదయం 6గంటల నుంచి రేపు రాత్రి 10 గంటల వరకు (ఈనెల 28, 29 తేదీలు) నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ మహబూబ్‌నగర్ డివిజన్ కార్యనిర్వాహక అధికారి పుట్ట వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిపల్లి (బి) స్టేజీ దగ్గర ఎన్‌హెచ్44 బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్ వైడింగ్ కారణంగా మిషన్ భగీరథ పైప్ లైన్ మార్చడం జరుగుతుందని, పనులు పూర్తి కావడానికి సుమారు 40గంటల వ్యవధి పడుతుందని తెలిపారు.

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని పాలమూరు రెడ్డి సేవాసమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.ఇంద్రసేనారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లు రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధంగా నిధులు కేటాయించి కార్యవర్గాన్ని ప్రకటించాలన్నారు. గ్రూప్‌వన్ పరీక్షల్లో ఈడబ్ల్యుఎస్‌లో రెడ్డిలకు 10శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్(ఆల్‌మేవా) రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ఫారుక్‌హుస్సేన్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంతకు వరకు సమస్యలు పరిష్కరించక పోవడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గ్రామగ్రామాన సంత్‌గాడ్గేబాబా విగ్రహాలు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

పాలమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామగ్రామాన సంత్‌గాడ్గే బాబా విగ్రహాలను ప్రతిష్ఠించాలని నేషనల్ దోబీరిజర్వేషన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లాకమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంత్‌బాబా స్కూల్స్, అనాథాశ్రమాలు, వసతి గృహాలు, బాలిక పాఠశాలలు, కుష్టు రో గులకు చికిత్స, గోశాలలు నిర్మించారని తెలిపా రు. డా.బీఆర్ అంబేద్కర్ సంత్‌బాబబాను గురువుగా ప్రకటించుకున్నారని గుర్తుచేశారు. సమావేశంలో సి.రాజు, శివకుమార్, నాగరాజు, యాదగిరి, శివన్న, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో అండర్- 14 మహబూబ్‌నగర్ జిల్లా బాల,బాలికల ఖోఖో జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఎంపికలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, రమేష్‌బాబు, వడెన్న, మేరి పుష్ప, మోగులాల్ పాల్గొన్నారు.

అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



వెంకటరమణ కాలనీలో నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలికలో అభివృద్ధి కొంత ప్రాంతానికే పరిమితమైందని, వార్డులలో తిరుగుతుంటే ప్రజలు ఎన్నో సమస్యలు చెబుతున్నారని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డు వెంకటరమణ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇళ్ల మధ్యనే మురుగునీరు మలుస్తుందని కాలనీ వాసులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాటట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తొందరలోనే నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడ చూసినా పెద్దఎత్తున సమస్యలున్నాయని, కాలనీలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీలలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అన్ని కాలనీలలో నెలకొన్న సమస్యలను తొందరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాణి, రాజుపాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి సేవలో..

మహబూబ్‌నగర్ న్యూటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుమలదేవుని గుట్ట దేవస్థానంలో ఆదివారం అన్నమాచార్యుల 54 సంకీర్తనల కార్యక్రమం సందర్భంగా గోవింద నామస్మరణ మారుమోగింది. గాయకులు గద్వాల చంద్రశేఖర రావు నిర్వహించిన సంకీర్తన కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ వెంకటేశ్వర స్వామి సేవలో పాల్గొని, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, కమిటీ సభ్యులు శ్రీరామ్ రెడ్డి, సాయిబాబా, శ్రీనివాసులు, కోటేశ్వర్‌రెడ్డి, నరేందర్, రమేష్, శివకుమార్, టీటీడీ వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



తిమ్మాయిపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అడ్డాకుల మండలంలోని తిమ్మాయిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. వరిధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతాయన్నారు. ఈ సీజన్ నుంచే సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఈసందర్భంగా పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అడ్డాకుల, తిమ్మాయిపల్లి చెరువులకు కేఎల్‌ఐ ద్వారా నీరు వస్తుండడంతో తిమ్మాయిపల్లి దగ్గర జలాలకు పూజ చేశారు. అనంతరం వర్నెవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించి కురుమూర్తి జాతర వరకు పూర్తి కావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి విజయోహన్‌రెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, ఐకేసీ ఏపీఎం సుధీర్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి, శ్రీహరి, శరత్‌కుమార్‌రెడ్డి, షఫిహమ్మద్, మదనాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, భీమన్నయాదవ్, వేగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు

భూత్పూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాటికొండ వెళ్లే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడారు. ఎన్నో ఏళ్ళుగా జాతీయ రహదారి నుండి తాటికొండ గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతులకు నోచుకోకవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. రూ. 50లక్షలతో రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సాయిలు, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి జన్మదినం



సీతాదయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్, నాయకులు, కార్యకర్తలు

చిన్నచింతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని పర్కాపూర్‌లోని ఆమె నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సీతాదయాకర్‌రెడ్డి హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మక్తల్, దేవరకద్ర మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూలమాల, శాలువాలతో సన్మానించి, మిఠాయిలు పంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన కుటుంబంపై ఇంతమందికి ఉన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉందన్నారు. తన భర్త బతికినంతకాలం జనాల కోసం బతికాడని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో తనయుడు సిద్దార్థరెడ్డి, అల్లుడు జగదభిరామిరెడ్డి, జైనాల్‌రెడ్డి, వజీర్‌బాబు, రాఘవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆత్మలింగం, సాకలి వెంకటేష్, కో-ఆప్షన్ మైమూద్, శేఖర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు ఎమ్మెల్యేను కలిసిన యన్మనగండ్ల నాయకులు

నవాబ్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక బహిరంగ సభకు మండలంలోని యన్మనగండ్ల నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాలమహానాడు నాయకులు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులను కూడా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు బ్యాగరి నర్సింహులు, చెన్నయ్య, కేశవులు, రామస్వామి, రుద్రారం రవి, సిద్దయ్య తదితరులు ఉన్నారు.

జడ్చర్ల మినీ స్టేడియంలో ఆస్ట్రో టార్ఫ్ వికెట్ ప్రారంభం



ఆస్ట్రో టర్ఫ్ వికెట్ ప్రారంభించిన అనంతరం సంతోషం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

జడ్చర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లలోని మినీస్టేడియంలో క్రికెట్ క్రీడాకారులకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు ఆస్ట్రో టార్ఫ్ వికెట్‌ను ప్రారంభించారు. ఆస్ట్రో టార్ఫ్ వికెట్ ఏర్పాటుకు శ్రీరంగనాయక స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి సహకారం అందచేశారని నిర్వాహకులు తెలిపారు. దీంతో క్రికెట్ క్రీడాకారులకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మోయిన్, పీఈటీలు, వాకర్స్ పాల్గొన్నారు.